

రూపాయికే అనుమతులు

- ముున్సిపాలిటీల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు శుభవార్త
- ఇంటి నిర్మాణానికి తగ్గిన ఆర్థిక భారం
- ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు
- త్వరలో అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి కల. దీన్ని నెరవేర్చుకునేందుకు అష్ట కష్టాలు పడుతుంటారు. పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను సాకారం చేసేందుకు పడే బాధలు వర్ణనాతీతం. అలాంటి వారికి కూటమి ప్రభుత్వం ఓ శుభవార్త వినిపించనుంది. గతంలో ఇల్లు నిర్మించుకోవాలంటే.. వేలకు వేలు చెల్లిస్తే తప్ప.. అనుమతులు వచ్చేవి కాదు. పైగా అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. ఈనేపథ్యంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో తాజాగా పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలుస్తూ ఒక్క రూపాయి చెల్లిస్తే.. ఏ మాత్రం ఆలస్యం కాకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అనుమతులు పొందొచ్చు. ఈ విధానంతో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లైంది.

నంద్యాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇళ్లను నిర్మించుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించింది. 50 చదరపు మీటర్ల వీస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవడానికి ఒక్క రూ పాయి చెల్లిస్తే చాలు.. (అది కూడా ఆన్‌లైన్‌లో) వెంటనే తమ ఇంటి అప్రూవల్ మంజూరు అవుతుంది. సదరు యజమానికి కూడా ఎలాంటి అవస్థలు లేకుండా నిబం ధనల ప్రకారం ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. ఏది ఏమైనా తాజా నిర్ణయంతో పట్టణాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గి ఇంటి కల నిజమయ్యే అవకాశముంది.

దరఖాస్తు ఇలా..

50 చదరపు మీటర్లు విస్తీర్ణంలో ఇల్లు నిర్మించునే వారు ఎవరైనా జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల పరిధిలో అనుమతి పొందిన ఎల్‌టీపీలను సంప్రదిం చాలి. ఆ తర్వాత ఖాళీ స్థలం ఫొటో తగిన డాక్యుమెం ట్లు, లింక్ డాక్యుమెంట్స్, తదితర వివరాలు.. ఇల్లు నిర్మిం చుకునే ప్లాన్‌తో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆతర్వాత చలానా చెల్లించాల్సి వస్తుంది. వెంటనే ఒక్క రూపాయి ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే అనుమతులు వచ్చినట్లే. తాజా నిబంధనలతో గతంలో మాదిరిగా ఆయా మున్సిపల్ కార్యాలయాలు, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల చుట్టూ తిరగా ల్సిన అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో అప్రూవల్ పొందే అవకాశం లభించినట్లైంది.

అనుమతి రాగానే ప్రజలకు..



ఒక్క రూపాయి చెల్లిస్తే ఆలస్యం కాకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈవిధానం అమల్లోకి రాగానే అధికారుల వద్దకు రావాల్సిన అవసరం లేదు. ఈవిధానం అమలుకు సంబంధించి సమగ్ర వివరాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అనుమతి రాగానే ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తాం. పట్టణ పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ విధానం శుభపరిణామం.

● శేషన్న, కమిషనర్, నంద్యాల

50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో...

గతంలో ఇదే 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించాలంటే.. డెవపల్‌మెంట్, ఇతర చార్జీలతో కలిసి మొత్తంగా ఆ ప్రాంతంలో ఉండే స్థలం విలువలో 20శాతం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈప్రకారం సుమారు రూ.30నుంచి రూ.40వేల వరకు ఇంటి అప్రూవల్ రూపంలో ప్రతి ఒక్కరు చెల్లించాల్సి వచ్చేది. పైగా కమీషన్లు కూడా ఇవ్వాల్సి ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం రూ.1కే ఇంటి అప్రూవల్ చేసేందుకు శ్రీకారం చుట్టనుంది.

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు

-కర్నూలు (కార్పొరేషన్)
-ఆదోని మున్సిపాలిటీ
-ఎమ్మిగనూరు మున్సిపాలిటీ
-గూడూరు నగర పంచాయతీ
- నంద్యాల
- ఆత్మకూరు
- ఆళ్లగడ్డ
- డోన్
- బేతంచెర్ల (నగర పంచాయతీ)
- నందికొట్కూరు



ఆర్థికంగా ఊరట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో సుమారు 30శాతం వరకు 50 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన వారు ఉన్నట్లు ఆ వర్గాల నుంచి తెలుస్తోంది. ఆయా మున్సిపాలిటీల్లో ఉండే పేద, మధ్య తరగతి వారీగా తెలుస్తోంది. ప్రభుత్వం ఒక్క రూపాయికి ఇంటి అప్రూవల్ సదుపాయం కల్పించడంతో వీరందరికి ఆర్థికంగా ఊరట కల్పించి నట్లైంది. ఇదే క్రమంలో కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరిగి ఆలసిపోకుండా.. వారికి ఇచ్చే కమీషన్ల అదనపు భారంగా లేకుండా సులభతరం కానుంది. చాలా మంది ఈ విధానంతో ముందుకువచ్చి ఇల్లు నిర్మించుకునే అవకాశం లేకపోలేదు.

‘తుంగభద్ర’కు పోటెత్తిన వరద

- నీటి మునిగిన పంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



నీట మునిగిన వరి పంట

కౌతాళం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాం నిండిపోవడంతో అధికారులు ఆదివారం తుంగభద్ర నదికి దాదాపు 1.4 లక్షల క్యూసెక్కుల నీటిని వదలడంతో నీరు మండల పరిధిలోని నదీతీర గ్రామాలకు వరద నీరు పోటెత్తింది. నదీతీరంలో ఉన్న వ్యవసాయ బోర్లు నీటిలో మునగడంతో వాటిని నది నుంచి ఒడ్డుకు తీసుకురావడానికి రైతులు అవస్థలు పడ్డారు. కుంబళ నూరు-హల్వి మధ్య ఉన్న వంకకు వరద నీరు చేరడంతో ఇరువైపుల రాకపోకలు నిలిచి పోయాయి. గంట గంటకు నదిలో నీటి మట్టం పెరుగుతుండటంతో నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి సూచించారు.



కుంబళనూరు-హల్వి మధ్య నిలిచిన రాకపోకలు

జీతాలు తక్షణమే చెల్లించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మే, జూన్ నెలల్లో పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు తక్షణమే జీ తాలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చే శారు. నగరంలోని సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శి టీకే జనార్దన్ అధ్యక్షతన నిర్వ హించారు. నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో బదిలీలు, పదోన్నతులు జరిగాయని, కొత్తగా మంజూరైన ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల, పాఠశాలల సహాయకులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులలో నియమితులైన వేలాది మంది ఉపాధ్యాయులకు రెండు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించ కపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. 12వ పీఆ ర్‌సీ కమిషన్, 30 శాతం మధ్యంతర భృతి, 11వ పీఆర్‌సీ బకాయి లను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను మం జూరు చేయాలని, సరెండర్ లీవుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవి విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు ఇస్మాయిల్ సాహెబ్, అబ్దుల్ రహీం, దేవదాసు, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్కాంలో సూత్రధారి జగనే

‘కుడా’ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాంలో సూత్రధారి మాజీ సీఎం జగనే అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ‘కుడా’ చైర్మన్ సోమి శెట్టి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. సోమిశెట్టి మాట్లాడుతూ తన పేరు మిథున్‌రెడ్డి ఎక్కడ బయట పెడుతారోనని పరామర్శ పేరిట జగన్ జైలుకు పరుగులు తీశారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో జరిగిన స్కామ్‌లు వెలుగులోకి వస్తు న్నాయన్నారు. దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని తమని ఇబ్బంది పెట్టిన వారిని అప్పుడు ఎవరిని వదలి పెట్టమని విచారణ అధికారులను జగన్ భయపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుంటే వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. వ్యవస్థలన్నింటినీ గాడిలో పెట్టేందుకు ఎన్నో ఇబ్బం దులు ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మహానందిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో, అర్చకులు

మహానంది, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మహానందీశ్వరుడిని హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముం దుగా వీరికి ఆలయ ముఖ మండపం వద్ద తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి ప్రధా న ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, కుంకుమా ర్చన, కోదండ రామాలయంలో నామార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు వీరిని ఆశీర్వ దించారు. ఈవో శ్రీనివాసరెడ్డి జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులను శాలువాతో సన్మానించి, స్వామివారి మెమెంటోను అందజేశారు. వీరి వెంట నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రా ఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ టీఎం నదాఫ్ కుటుంబ సమేతంగా ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించు కున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూ ల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధి పతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షి తలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట శ్రీపతి ఆచార్, అనంతపురాణిక్, ఎస్ఐ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆ చార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ ఉన్నారు.

ఉద్యోగులంతా ఏకమై ఆందోళన చేస్తాం

- కొత్తవారిని నియమించకపోవడం దారుణం
- వ్యవసాయ ఉద్యోగుల సర్వీసు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్



మాట్లాడుతున్న పీవీ సాయికుమార్

కర్నూలు అగ్రికల్చర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వ్యవ సాయ శాఖలో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగిపోయిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యోగులంతా ఏకమై ఆందోళన చేస్తామని వ్యవసాయ ఉద్యోగుల సర్వీసు సంఘం రాష్ట్ర అధ్య క్షుడు పీవీ సాయికు మార్ హెచ్చరించారు. ఆదివారం కర్నూలు నగరంలోని వ్యవసాయశాఖ కాన్ఫరెన్స్ హాల్లో సాయికుమార్ అధ్యక్షతన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరి గింది. ఉద్యోగులకు సంబంధిం చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఏవిధమైన ఒత్తిడి పెంచాలనే విషయంపై చర్చిం చారు. పదవీవిరమణ చేసినవారి స్థానాల్లో కొత్తవారిని నియమించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం దారుణమ న్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్‌కు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యవర్గం తరుపున, జిల్లా సంఘం తరుపున సన్మా నించారు. వ్యవసాయ శాఖలో పని చేయుచున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇప్పించిన రాష్ట్ర ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు రవిప్రకాష్, ఎంసీ కాశన్న, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు సముచిత స్థానం 7

కాలేయ వ్యాధితో ముప్పు...
- చాప కింద నీరుగా విస్తరిస్తున్న వ్యాధి
- ముందస్తు వ్యాక్సీతో చెక్

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలంలో దర్శనానికి వచ్చిన భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దర్శనార్థం భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రం నుంచే కాకుండా వివిధప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్య స్నానమా చరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణ తో ఆలయం మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తాగునీరు, అల్పాహారాన్ని అందించారు.

మహానందిలో రద్దీ



మహానందిలో క్యూలో ఉన్న భక్తులు

మహానంది, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం వేలాదిమంది భక్తుల రద్దీ నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వివిధ వాహనాల ద్వారా శనివారం రాత్రే చేరుకున్నారు. వేకువజామున్నే రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించడానికి క్యూ కట్టారు. స్వామి వారి మహా మం గళహారతుల సేవతో పాటు స్పర్శ దర్శనం కోసం బారులు తీరారు. రాత్రి వరకు క్షేత్ర పరిసరాల్లో భక్తులతో రద్దీ వాతావరణం నెలకొంది.

ఎట్టకేలకు సీట్ల మార్పు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదులు వెళ్లడంతో స్పందించిన అధికారులు
- ఇప్పటికీ ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అవుట్ చేయని వైద్యశాఖ



కర్నూలు హాస్పిటల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కొత్తగా వచ్చిన సీనియర్ అసిస్టెం ట్లకు సీట్లు కేటాయించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో డీఎంహెచ్‌వో ఆఫీసులో పని చేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెం ట్లతో పాటు కిందిస్థాయి సిబ్బంది బదిలీ అయ్యారు. ఉద్యోగులు బదిలీ అయిన పీహెచ్‌సీలకు వెళ్లకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల డీఎంహెచ్‌వో కార్యాలయా నికి బదిలీపై వచ్చిన ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు కూడా ఇంత వరకు సీట్లు కేటాయించలేదని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై డీఎం హెచ్‌వో శనివారం కొత్తగా వచ్చిన ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు సీట్లు కేటాయించారు. డాక్టర్, ఆల్ గెజిటెడ్ సీటు అయిన ఈ1 సెక్ష న్ ఫణిభూషణ్, స్టాఫ్ నర్సు, ఎంపీహెచ్‌ఈవో, ఎంపీహెచ్‌ఎస్, పీహెచ్‌ఎన్ హెల్త్ ఎడ్యుకేటర్, హెడ్‌నర్సు, ఎంఎల్‌హెచ్‌పీ, ఎన్‌హె చ్‌ఎం సీట్లు అయిన ఈ2 సెక్షన్‌ను బి.విశ్వనాథ్‌కు, ఈ3 సెక్షన్ వై.భూపాల్‌కు సీనియర్ అసిస్టెంట్, ఎల్‌డీ కంప్యూటర్, బిల్డింగ్, ఏజీ ఆడిట్‌ను కేటాయించారు. హాస్పిటల్ రిజిస్ట్రేషన్ అయిన ఈ3ని డెమో సెక్షన్‌కు కేటాయించారు. అయితే అందుకు డెమో సెక్షన్ ఈ సీటును స్వీకరించేందుకు విముఖత చూపినట్లు తెలి సింది. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్లుతో పాటు కొందరి నాలుగో తరగతి సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ ఇంత వరకు అవుట్ చేయకపోవడం విమ ర్శలకు తావిస్తోంది. బదిలీ అయిన ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎందుకు అవుటింగ్ కొట్టలేదన్న చర్చ ఉద్యోగుల్లో తీవ్రంగా సాగుతోంది.

యువకుడి బలవన్మరణం

- ప్రేమికురాలు ఆత్మహత్య చేసుకోవడంతో మనస్తాపం చెంది..
- చిప్పగిరి మండలం తిమ్మాపురంలో ఘటన


రాజు (ఫైల్)

ఆలూరు(చిప్పగిరి), జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలు కాదన్నారు. ప్రియుడు దూరమయ్యాడనే మనస్తాపంతో ప్రేమికురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ప్రియుడు ఇక తన ప్రియురాలు లేని లోకంలో నేనెందుకు అనుకుని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిప్పగిరి మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరిగింది. వివరాలివీ.. తిమ్మాపురం గ్రామానికి చెందిన రాజు(28) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో ఓ ప్రైవేట కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు కులాలు వేరు కావడంతో అమ్మాయిని గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురైంది. ఆ యువతి గుంతకల్లులోని తన ఇంట్లో ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన తల్లిదండ్రులు గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ ఆ యువతి మృతి చెందింది. విషయం తెలియ డంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. చిప్పగిరి, గుంతకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం


ఎరువుల నిల్వల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ఆదోని అగ్రికల్చర్ , జూలై 27(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని డీసీఎంఎస్(ఉమ్మడి జిల్లా కోపరేటివ్ మార్కె టింగ్ సొసైటీ) ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం ఆదోని మార్కె ట్‌యార్డ్‌లోని డీసీఎంఎస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. యూరియా అం దుబాటులో లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు రోజుల క్రితం సీఎం చంద్రబాబు కర్నూలు పర్యటనలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై ఆయన దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వెంటనే కలెక్టర్‌కు ఎరువులు కొరత లేకుండా చూడాలని సూచించారు అన్నారు. రెండు రోజు ల్లో డీసీఎంఎస్ కేంద్రాలకు, రైతు సేవా కేంద్రాలకు యూరియా కేటా యిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా అధికారులతో మాట్లాడామని, రైలు వ్యాగన్ నుంచి ఎరువులు వస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని డీసీఎంఎస్‌కి అత్యధికంగా ఎరువులు కేటాయించా మని, 1500 మెట్రిక్ టన్నుల ఎరువులలో 750 టన్నుల ఎరువులను విక్రయిం చినట్లు తెలిపారు. రెండు రోజుల్లో మరో 350 మెట్రిక్ టన్నుల యూరియాను డీసీఎంఎస్ కేంద్రానికి సరఫరా చేస్తామన్నారు.

సైబర్ కేటుగాడి మాయాజాలం


- ఏఎస్ఐ పేరుతో రూ.50వేలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

హొళగుంద, జూలై 27(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్ల మాయా జాలానికి మరొకరు బలి అయ్యారు. ఏఎస్ఐ పేరు చెప్పి బాధితుడి నుంచి రూ.50వేలు వసూలుచేసిన ఘటన హొళగుందలో చోటుచేసుకుంది. బాధి తుడు(పేరు చెప్పడం ఇష్టంలేని యువకుడు) తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న హనుమంతు అంటూ బాధితుడికి ఓ సైబర్ కేటుగాడు శనివారం ఫోన్‌లో పరిచయం చేసుకున్నా డు. కర్నూల్ నుంచి మాట్లాతున్నానని, హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో పని చేసే ఓ కానిస్టేబుల్ కూతురికి యాక్సిడెంట్ అయిందని తెలిపాడు. చికిత్స కోసం బెంగళూరుకి తీసుకువెళ్లాలని, తన వద్ద రూ.50వేలు డబ్బులు లిక్విడ్ క్యాష్ ఉందని నమ్మించాడు. ఫోన్ పేలో లేకపోడంతో నువ్వు రూ.50వేలు ఫోన్‌పేలో వేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డబ్బులు తీసుకోవాలంటూ చెప్పాడ న్నారు. బాధితుడు ఫోన్‌పే ద్వారా అతడికి రూ.50వేలు డబ్బులు పంపిం చాడు. అనంతరం స్టేషన్‌కు వెళ్లి ఏఎస్ఐ హనుమంతు పేరుతో విచా రించగా అలాంటి వారు ఎవరు ఇక్కడ లేరని పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపారు.

మల్లన్న సన్నిధిలో బిహార్ మంత్రి నితీశ్ మిశ్రా


మల్లన్న దర్శనానికి శ్రీశైలం చేరుకున్న బిహార్ మంత్రి నితీశ్ మిశ్రా

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాం బికామల్లికార్జున స్వామి వారిని బిహార్ పరిశ్రమలశాఖ మంత్రి నితీశ్ మిశ్రా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మం త్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నితీశ్ మిశ్రా స్వామి అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.



కాలేయ వ్యాధితో ముప్పు..

- చాప కింద నీరుగా విస్తరిస్తున్న వ్యాధి
- ముందస్తు వ్యాక్సిన్‌తో చెక్
- నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం
- జిల్లా వ్యాప్తంగా 1200 మంది వ్యాధిగ్రస్థులు
- నేడు హెపటైటిస్ డే

శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. ఆహా రాన్ని జీర్ణం చేయడమే కాకుండా శరీరంలో ఉండే విష పదార్థాలను బయ టకు పంపే శక్తి కాలేయం సొంతం. హెపటైటిస్ వైరస్ కారణంగా లివర్‌కు ముప్పు వాటిల్లుతుంది. కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత సమస్యతో బాధ పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది సాధారణ భాషలో దీన్ని కామెర్లుగా పిలుస్తారు. ఏటా జూలై 28వ తేదీన ప్రపంచ హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ బ్లంబెర్గ్ జయంతి సందర్భంగా ఈ డేను ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'హెపటైటిస్ మనం విడమర్చి ఆలో చించుద్దాం' అన్న నినాదాన్ని ఇచ్చింది.

కర్నూలు హాస్పిటల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ (కాలేయ) వ్యాధితో ముప్పు పొంచి ఉంది. కర్నూలు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభా గానికి ప్రతి నెల 300 మంది హెపటైటిస్ బాధితులు వస్తుంటారు. ఈ వ్యాధి సోకితే ఆ విషయం బాధితులకు అంత తొందరగా తెలిపేలోగా చాలా నష్టం జరిగిపోతుంది. ముందస్తు వ్యాక్సినేషన్‌తో చెక్ పెట్టవచ్చు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది 1200 మంది హెపటైటిస్ వ్యాధిగ్రస్థులున్నారు. వీరిలో హెపటైటిస్ బీ బాధితులే ఎక్కువ. ఉమ్మడి జిల్లాలోని డోన్, ప్యాపిలి, పెద్దహూజర్ల, చిన్నహూజర్ల, ఆదోని డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు, తెలంగాణలోని గద్వాల, వనపర్తి జిల్లా నుంచి సైతం వ్యాధిగ్రస్తులు అధికంగా వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో హైప టైటిస్ వ్యాధిపై అవగాహన లేని కార ణంగా ఎక్కువ మంది వ్యాధిబారిన పడు తున్నారు. మద్యపానం, కలుషిత నీరు, కలుషిత ఆహారం, రక్తమార్పిడి, అసుర క్షిత సెక్స్‌తో ఈ వ్యాధి సంక్రమిస్తుంది.



ఐదు రకాల వైరస్‌లు..

హెపటైటిస్ ఏ, బీ, సీ, డీ, ఈ అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల కాలేయ సమస్య ఏర్పడుతుంది. హెపటైటిస్ అంటే లివర్‌కు కలిగే వైరస్ ఇన్ఫెక్షన్. వీటిలో ఏ, డీ, ఈ వైరస్‌లు అంత ప్రమాదకరం కావు. ఇవి కలుషిత, ఆహారం, నీటిని తీసుకోవడంతో వస్తాయి. కొద్ది రోజుల పాటు పచ్చకామెర్లు వచ్చి తగ్గిపోతాయి. కానీ బీ, సీ వైరస్ మాత్రం ప్రమాదక రమైనవి. ఈవైరస్‌లను నిర్లక్ష్యం చేస్తే లివర్ సిరోసిస్ (క్యాన్సర్) దశకు చేరి ప్రాణహాని కలుగుతుంది.

హెపటైటిస్ బీ, సీతోనే..

హెపటైటిస్ బీ, సీ బారిన పడితే ఇబ్బందులు ఉంటాయి. హెపటైటిస్ బీ కలుషిత రక్తం, సిరంజి, సూదులు, వినియోగించడం అసురక్షితమైన లైంగిక సంపర్కం, తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుంది. ఈవ్యాధి బారిన పడిన వారిలో 80శాతం మందికి అసలు ఈ వ్యాధి ఉన్న విషయం తెలియదు. హెపటైటిస్ బీ బాధితుల్లో 20 శాతం లివర్ సిరోసిస్ (కాలేయం పూర్తిగా దెబ్బతిని పని చేయదు) బారిన పడుతారు. జనాభాలో హెపటైటిస్ బీ బాధితులు 3.5 శాతం మంది ఉన్నారు. ఇక హెపటైటిస్-సీ వ్యాధి ఇంట్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా పచ్చకామెర్లతో ఇబ్బంది పడుతున్న వారి నుంచి వస్తుంది. హెపటైటిస్ సీ బారిన పడిన వారిలో 80 నుంచి 90 శాతం లివర్ సిరోసిస్ దశకు చేరుతారు.

హెపటైటిస్-బీ కేసులు అధికం



హెపటైటిస్-బీ బాధితులు నెలకు 120 మంది దాకా గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి వస్తుంటారు. హెపటైటిస్-సీ కేసులు 85 దాకా వస్తాయి. నేషనల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి హెపటైటిస్ బీ, సీ వైరస్‌లను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకొంది. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకుని సోమవారం 250 మంది ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు వ్యాక్సిన్‌ను వేస్తున్నాం.

- డాక్టర్. జి.మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జీజీహెచ్, కర్నూలు.

సకాలంలో వైద్యం అందించకపోతే..



హెపటైటిస్ వైరస్ కాలేయానికి వచ్చే సమస్య. బీ, సీ వైరస్‌లకు సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాంతకంగా మారుతాయి. హెపటైటిస్ నివారించడానికి మూడు డోసుల వ్యాక్సిన్‌ను తీసుకోవాలి. ప్రజలు హైపటైటిస్ బీ, సీ వైరస్‌పై జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఇన్ఫెక్షన్ ఉన్న రక్తం ద్వారా...



ఇన్‌ఫెక్షన్ ఉన్న రక్తం ద్వారా ప్రధానంగా వ్యాపించే వ్యాధి ఇది. సరైన స్క్రీనింగ్ చేయకుండా రక్తమార్పిడి ఎంతో ప్రమాదం. వ్యాధి ఉన్నట్లు అసలు లక్షణాలు కనిపించవు. తీవ్రత పెరిగాక జ్వరం, అలసట, రుచి కోల్పోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయి. ప్రారంభ దశలో గుర్తించి వైద్యం చేయించుకోకపోతే సమస్య తీవ్రమై ప్రాణాంతకంగా మారుతుంది.

- డా.పి.అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

పారదర్శకంగా రుణాల మంజూరుకు కృషి

ప్రమాణ స్వీకారం చేసిన పసుపుల పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాముడు


మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాముడు

కర్నూలు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు పారదర్శకంగా రుణాలు మంజూరు చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ బళ్లారి వెంకటరాముడు అన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సూదిరెడ్డిపల్లెలో ఆదివారం పీఏసీఎస్ నూతన ఛైర్మన్‌గా బళ్లారి వెంకటరాముడు ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు హాజరై వెంకటరాముడుతో ఛైర్మన్‌గా ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు కురువ రామకృష్ణ, చంద్రమౌళి ఇద్దరు రైతులను డైరెక్టర్ ప్రమాణం చేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తనపై నమ్మకంతో పదవి రావడానికి సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీమంత్రి రాంభూపాల్‌చౌదరి ఆశీస్సులతో ఈస్థాయికి ఎదిగానని అన్నారు. టీడీపీకి 35ఏళ్ల పాటు సామాన్య కార్యకర్తగా పనిచేశానని పార్టీపెద్దలు గుర్తించి పదవి ఇచ్చారని ఆయన వివరించారు. ఈ సొసైటీ పరిధిలో దాదాపు 11 గ్రామాలు వస్తాయని ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సంక్షేమ పథకాలను వర్తింపజేసి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం సూదిరెడ్డిపల్లెలో ర్యాలీగా వెళ్లారు. దివంగత మాజీ మంత్రి రాంభూపాల్‌చౌదరి తనయులు సుమన్, నవీన్, సొసైటీ మాజీ ఛైర్మన్ కేఈ వేమన్నగౌడ్, విశ్రాంత సీఈవో మురళీ, ఇన్‌చార్జి సీఈవో సతీష్, స్థానిక నాయకులు సత్యంరెడ్డి, బి.తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయన్న తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా చేశారు

- బినామీ పేరుతో ఓ వైసీపీ నాయకుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు
- తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసిన బాధితుడు


ఆన్‌లైన్‌లో చేయించుకున్నారని చూపుతున్న దళిత యువకుడు మౌలాలి

కోసిగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైసీపీ నాయకుడు బినామీ పేరుతో ఆన్‌లైన్ ఎక్కించి తమ భూమిని భూకబ్జా చేశారని కందుకూరు గ్రామానికి చెందిన దళిత యువకుడు మౌలాలి ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన తన తాత హరిజన ఎల్లప్పకు 1970లో కడిదొడ్డి గ్రామ సర్వే.నెం.25/ఏ1లో రెండెకరాల 42 సెంట్లు ప్రభుత్వ పట్టా ఇచ్చిందని చెప్పారు. తన తాత, తల్లిదండ్రులు సాగు చేశారని , వారి మరణానంతరం తాను పత్తి పంట వేసి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అడంగల్ ఆర్‌వోఆర్‌లో తన తాత ఎల్లప్ప పేరు కాకుండా గంగాధర్ స్వామి అనే పేరు మీద ఉండటంతో అవాక్కు అయినట్లు తెలిపారు. ఈ విషయంపై విచారించగా వైసీపీ నాయకుడి ఇంట్లో పని చేసే కర్ణాటకకు చెందిన గంగాధర్ స్వామి అని తేలిందన్నారు. తనకు జరిగిన ఈ అన్యాయాన్ని తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ హనుమంతరెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

వివరణ: ఇదే విషయమై కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా బాధితుడు మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించామన్నారు. గతంలో వీరి తాతకు ప్రభుత్వం సర్వే.నెం.25ఏ1లో రెండెకరాల 42 సెంట్లు భూమి కేటాయించిందన్నారు. ఇప్పుడు మాత్రం ఆన్‌లైన్‌లో గంగాధర్ స్వామి అనే వ్యక్తి పేరు ఉందని, వీఆర్వో ద్వారా ఆయనకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పూర్తిగా విచారించి ఆన్‌లైన్‌లో రికార్డులను తారుమారు చేసిన వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాకు సముచిత స్థానం

- స్త్రీశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్‌గా గౌరు చరిత
- ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్‌గా బీటీ నాయుడు
- మరో రెండు కమిటీల్లోనూ సభ్యుడిగా బీటీ
- పలు కమిటీల్లో సభ్యులుగా ఎమ్మెల్యేలకు చోటు

కర్నూలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసనమండలి ఉభయ సభలకు సంబంధించి తొమ్మిది సంయుక్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు సముచిత స్థానం కల్పించారు. ఈకమిటీల ఛైర్మన్లు, సభ్యులను ఆదివారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ప్రకటించారు. శాసనసభల్లో ఓ కమిటీకి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను ఛైర్ పర్సన్‌గా నియమిస్తే.. శాసన మండలిలో కీలకమైన ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడును నియమించడం రాజకీయంగా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత దక్కినట్లయింది. పలు కమిటీల్లో ఎమ్మెల్యేలను సభ్యులుగా నియమించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీలు నియమించినట్లు తెలుస్తుంది. 2025-26 సంవత్సరానికి ఏడాది కాలం కొనసాగేలా ఈ కమిటీలను నియమించినట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


గౌరు చరిత

- శాసనసభ స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ ఛైర్ పర్సన్‌గా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని నియమించారు. 11 మంది సభ్యులను నియమించారు. స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఈ కమిటీ పని చేస్తుంది. వారి అభ్యున్నతి కోసం శాసనసభలో పలు బిల్లులు పెట్టేందుకు కీలకమైన సూచనలు చేయడంతో పాటు హక్కుల కోసం కృషి చేస్తుంది.
- శాసనమండలిలో అత్యంత కీలకమైన ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ బెందుల తిరుమలనాయుడు (బీటీ నాయుడు)ను నియమించారు. సభ్యుల హక్కుల రక్షణలో ఈ కమిటీ ప్రత్యేకంగా పనిచేస్తుంది. సభ్యులు సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు సమస్య తీవ్రంగా ఉంటే సస్పెండ్ చేసే అవకాశం కూడా ఉంది. సభా వ్యవహారాల నిర్వహణలో అత్యంత కీలకమైన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ఛైర్మన్‌గా ఉన్న సభా నియమాల కమిటీలోనూ, వన్యప్రాణులు-పర్యావరణ పరిరక్షణ కమిటీలో కూడా బీటీ నాయుడును సభ్యుడిగా నియమించారు.


బీటీ నాయుడు



జయసూర్య

- గిరిజన సంక్షేమ కమిటీ సభ్యుడిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు అవకాశమిచ్చారు. ఈయన ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గ ప్రాంతంలో గిరిజనులు అధికంగా ఉన్నారు.
- శాసనసభలో ఎమ్మెల్యే బీద రవిచంద్ర ఛైర్మన్‌గా ఉన్న బీసీ సంక్షేమ కమిటీలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును సభ్యుడిగా నియమించారు. అలాగే గ్రంథాలయ కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు. రెండు కమిటీల్లో సభ్యుడిగా నియమించడం కొసమెరుపు.


కేఈ శ్యాంబాబు


బుడ్డా రాజశేఖరరెడ్డి

- శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఛైర్మన్‌గా ఉన్న వన్యప్రాణులు- పర్యావరణ పరిరక్షణ కమిటీలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని సభ్యుడిగా నియమించారు. ఈ నియోజకవర్గం వన్యప్రాణులకు నిలయం. వాటి సంరక్షణకు కమిటీ సభ్యుడిగా పని చేసే అవకాశం వచ్చింది. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బి.విరుపాక్షిని మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమించారు.


బి.విరుపాక్షి

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ఓర్వకల్లు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు కోరారు. ఆదివారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు షాజహాన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి అంజిబాబు, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీఐటీయూ నాయకులు గోపాల్, శ్రీధర్, రేణుకమ్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. అర్హతలు బట్టి ఉద్యోగాలు కల్పించాలన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడిగా షాజహాన్, మండల కార్యదర్శి శ్రీధర్, మండల ఉపాధ్యక్షులుగా సుధాకర్, ధనుంజయుడు, సహకార కార్యదర్శులుగా నాగభూషణ్ నాయక్, రాజు, కమిటీ సభ్యులుగా సరళ, శోభారాణి, శ్యామల, మద్దయ్య, గోరంట్ల, దస్తగిరి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

సి. బెళగల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని విద్యుత్ ఏడీ జేసన్ రైతులకు, గృహయజమానులకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయవద్దని, వర్షాకాలంలో విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

సి. బెళగల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తకోట పంపుహౌస్ దగ్గర ఉన్న రేమట ఎత్తి పోతల పథకం మోటార్ల ద్వారా నీటిని విడుదల చేశారు. సాగునీటిని రైతులు వృథా చేయవద్దని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్లెల్సీ అధికారులు సుబ్బరాయుడు, దుర్గభవాని, చైర్మన్ మహేశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు డాక్టర్ తిమ్మప్ప, తెలుగుయువత అధ్యక్షుడు హరి, భీమన్న, ఎంపీటీసీలు ఈరన్న గౌడు, ధనుజయుడు, విద్యాకమిటీ చైర్మన్ల వెంకటేశ్వర్లు, రేమట వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

● మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కాశీం రూ.45 వేలు, మల్లు సుజాతమ్మకు రూ.1.45లక్షలు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద మంజూరు కావడంతో ఆదివారం ఎమ్మెల్యే దస్తగిరి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు డాక్టర్ తిమ్మప్ప, కొత్తకోట హరి, ఎంపీటీసీ ఈరన్నగౌడు, విష్ణుహమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, ధనుంజయుడు, విద్యకమిటీ చైర్మన్ల వెంకటేశ్వర్లు, శ్రీను, తిమ్మప్ప, జయపాల్ పాల్గొన్నారు.

కమిషనర్ ఇంటి ముందు ధర్నా



కమిషనర్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఇంటి వద్ద సీపీఎం నాయకులు నగరంలోని ఖల్లా, బండిమెట్ట కాలనీవాసులతో కలిసి ఆదివారం ధర్నాచేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి రెండు రోజులైనా నీటి సరఫరాలో మున్సిపల్ అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గసభ్యులు ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, సీనియర్ నాయకులు పార్వతయ్య కే.రామక్రిష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల కష్టం వెలకట్టలేనిది


కార్మికులను సన్మానిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష

కర్నూలు న్యూసిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగరానికి సంబంధించి ఇటీవల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భంలో మున్సిపల్ నాన్ పబ్లిక్ హెల్త్ కా ర్మికులు పడిన కష్టం వెలకట్టలేనిదని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండులోని సమితి కార్యాలయంలో లీకేజీ పనులను విజయవంతంగా పూర్తిచేయడంలో కీలకపాత్ర పోషించిన కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, సిబ్బంది ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, రంగ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఆర్థిక భారం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

కర్నూలు న్యూసిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఆర్థిక భారం పడుతుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బీఏఎస్ కల్యాణ మండపంలో సంఘం అధ్వర్యంలో 'అదాని స్మార్ట్ మీటర్లు ఏర్పాటు-అపార్ట్‌మెంట్లపై ఆర్థిక భారం' అనే అంశంపై విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ బిజయరామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించకపోతే రాబోవు రోజుల్లో ప్రజలపై చాలా భారాలు పడతాయన్నారు. ఆగస్టు 1న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎస్ఈకి వినతి పత్రం అందజేయాలని తీర్మానించారు. సమావేశంలో నగరంలోని వివిధ అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ నాయకులు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, యువజన సంఘం నాయకుడు నగేష్, సీపీఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు, ఎం.రాజశేఖర్, ప్రకాష్‌రావు, చాంద్‌బాషా, సుల్తాన్‌బాషా పాల్గొన్నారు.

నత్తనడకన ఆలయ పనులు

● వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణంలో కొరవడిన నాణ్యత
● పట్టించుకోని అధికారులు


నాణ్యతలేని ధ్వజ స్తంభం


కన్నమడకలలో పూర్తి కాని వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణం

ఓర్వకల్లు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నమడకల గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో 2023 మార్చి 28న అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి రూ.40 లక్షలతో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడికి పనులు అప్పగించారు. అయితే ఆనాయకుడు పనులు నాసిరకంగా, నిర్లక్ష్యంగా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లు అయినా పనులు పూర్తికాకపోవడంతో స్వామికి పూజలు, ధూప దీప నైవేద్యాలకు కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆలయంలో వేణుగోపాల స్వామి విగ్రహాన్ని తలకిందులుగా పెట్టడంతో కాంట్రాక్టరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసేందుకు ధ్వజస్తంభం కూడా నాణ్యత లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను నాణ్యతగా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పనులు నిలుపుదల చేస్తాం

వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణం పనులో నాణ్యత లేదని గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఇంజనీర్లకు చేరవేశాను. పనులు పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. పనులు నాణ్యతగా చేపడుతాం.

● చంద్రశేఖర్ రెడ్డి,
ఈవో, వేణుగోపాలస్వామి ఆలయం

నాటకరంగం వైపు యువత దృష్టి సారించాలి

● అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్ రెడ్డి


మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం యువత సెల్‌ఫోన్, యూట్యూబ్ సినిమాలతో దారి తప్పుతోందని, వారి దృష్టి నాటకరంగం వైపు మరలిస్తే దేశం బాగుపడుతుందని ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో 'మాకు స్వాతంత్ర్యం కావాలి' బాలికలచే లఘు నాటిక, బాపట్ల జిల్లా ద్రోణాదుల పరిషత్ వారిచే 'వర్క్ ఫ్రమ్ హోం' నాటక ప్రదర్శన జరిగాయి. సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య, నాటక దర్శకులు బి.మహేంద్ర, సినిమా నటి లహరితో పాటు భగవద్గీతలో అవధానం చేస్తున్న ఆంధ్ర ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించగా.. బీసీ సంక్షేమ జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, జేఎన్ శేషయ్య, పి.దస్తగిరితో పాటు కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, వ్యాఖ్యాతలు యాగంటి ఈశ్వరప్ప, ఇనయతుల్లాతో పాటు టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. షాద్‌నగర్‌కు చెందిన బాలికలు ప్రదర్శించిన 'మాకు స్వాతంత్ర్యం కావాలి' నాటిక ప్రతి ఇంట్లో అత్త, కోడలికి మధ్య జరిగే పోరాటం పరిష్కారం తెలిపింది. ఈ నాటకానికి పీవీ రంగయ్య దర్శకుడు, అదే విధంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు భార్యాభర్తలు ఉద్యోగస్తులయితే అక్కడ వారికి ఏర్పడే సమస్యలు, తగాదాలు మొదలైన వారిని వర్క్ ఫ్రం హోం చక్కగా వివరించండి. ఈ నాటికలు మహేంద్ర శివరాం, ప్రసాద్, షేక్ షఫీ, నాగేశ్వరరావు, లహరి తదితరులు చక్కగా నటించి ప్రేక్షకులను అలరించాయి.

జిల్లా యోగా సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


కార్యవర్గ సభ్యులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం స్థానిక కృష్ణానగర్‌లో ఉన్న జిల్లా యోగా సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈఎన్నికల్లో జిల్లా సంఘం చైర్మన్‌గా దండు లక్ష్మికాంతరెడ్డి, అధ్యక్షుడిగా అవినాష్ శెట్టి, కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా డా.ఎస్.ఎ.ముంతాజ్‌బేగం, ప్రధాన కార్యదర్శిగా కురువ మునిస్వామి, కోశాధికారిగా కుమ్మరి విజయకుమార్, ఉపాధ్యక్షులుగా ఎంవీ సాయికృష్ణ, బి.శ్రీనివాసులు, ఎం.శశిధర్, ఏ.బ్రహ్మానందరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా లోకేశ్, విజయభాస్కర్‌రెడ్డి, దండు విద్యాసాగర్, కేశవ, కార్యవర్గ సభ్యులుగా నాగగణేష్, శ్రీనివాసులు, టి.లక్ష్మికాంత్, కే.విశ్వతేజ, రోజామణి, రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అడ్వకేట్ శ్రీనివాసులు ప్రకటించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి ఎన్నికలకు పరిశీలకులుగా అథ్లెటిక్స్ శిక్షకుడు కాశీరావు, రాష్ట్ర యోగా సంఘం నుంచి ఎన్నికల పరిశీలకులుగా ఈశ్వర్‌నాయుడు వ్యవహరించారు. అనంతరం నూతన సంఘం చైర్మన్ దండు లక్ష్మికాంతరెడ్డి, అధ్యక్షుడు అవినాష్‌శెట్టి మాట్లాడుతూ జిల్లాల కలిసికట్టుగా యోగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతన కమిటీ నాలుగు సంవత్సరాల పాటు కొనసాగుతుందన్నారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు.

చర్చిలో ముగిసిన కమిటీల ఎన్నికలు


ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో ఎన్నికలు నిర్వహిస్తున్న చర్చి ఫాదర్లు, ఓట్లు వేస్తున్న చర్చి సభ్యులు

కర్నూలు కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చి (సీఎస్ఐ) చర్చిలో ఆదివారం రెండు ప్యానళ్లకు (కమిటీలకు) సంబంధించిన ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు ప్యానళ్లకు సంబంధించిన సభ్యులు పోటీలలో నిలువగా, కొందరు ఇండిపెండెంట్‌గా పోటీ పడ్డారు. సుమారు 1300కు పైగా సభ్యులు పాల్గొని ఓట్లు వేశారు. ఈఎన్నికలకు ఎన్నికల అధికారిగా నంద్యాల ఎస్‌పీజీ డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ రెవ. వరప్రసాద్ రావు వ్యవహరించారు. రిటర్నింగ్ అధికారులుగా పాస్టర్లు ఐజాక్ ప్రసన్న, జాన్సన్, థియోడర్, కలకత్తా రవికుమార్ పాల్గొన్నారు. ఉదయం 11గంటల ప్రారంభమైన ఈఎన్నికల ప్రక్రియ రాత్రి 7గంటల వరకు కొనసాగింది. సోమవారం ఉదయం ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తామని రెవ.వరప్రసాద్‌రావు తెలిపారు. ఈరెండు ప్యానళ్లకు ఎంపికైన ప్రతినిధులు 2025-2027 వరకు రెండు సంవత్సరాలు కొనసాగుతారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి

కోడుమూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ 29న జిల్లాకు రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యటన జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ మురళీనాయుడు నాయకులు లక్ష్మణ్, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కర్నూలు కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్న వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బి.క్యాంపులోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కింద గత 20 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. వారిని వెంటనే రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రకటించాలని కోరారు.

కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు అగ్రికల్చర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలను విక్రయించిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని వ్యవసాయ కార్మిక భవన్‌లో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 17మండలాల్లో 2021లో 1899మంది రైతులు కావేరీ కంపెనీకి చెందిన జాదురకం విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు గుంటూరు లామ్‌ఫామ్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు 2021లో జరిగిన నష్టాన్ని పూర్తిగా ఆయా గ్రామాల్లో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి నివేదికను పంపించారన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం కంపెనీ యజమానులకే వత్తాసు పలకడం వల్ల రైతులకు న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు కావేరి కంపెనీ నుంచి పరిహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగేష్, పెద్దారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం వర్ధంతి


అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డా.శరత్ చంద్ర, కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, ఉల్లోజిరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్

కర్నూలు న్యూసిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం తెలిపారు. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నగరంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య హాజరవుతారని అన్నారు.

చంద్రబాబుతోనే యువతకు భరోసా

● గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన యువత


గౌరు వెంకటరెడ్డి,
గౌరు జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన యువత

కల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడుతోనే యువతకు భరోసా అని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరు వెంకటరెడ్డి సమక్షంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల నుంచి దాదాపు 200 మంది యువకులు టీడీపీలో చేరారు. గౌరు వెంకటరెడ్డి యువకులను సాదరంగా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి సాయినాథ్‌రెడ్డి, కిరణ్, సూరి, కిషోర్, నరసింహా, గౌతమ్, మల్లేష్, శ్రీనివాసులు, విజయ్‌మోహన్, చిన్నా, నితిన్, బబ్లూ, వేదాంత్, విగ్నేష్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మురళిగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం


కరాటే బెల్టులు పొందిన క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరాటే మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు గ్రీన్, ఆరేంజ్, బ్రౌన్ బెల్టులను ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో కరాటే మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్నాథ గట్టుపై ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ పూజలు


రూపాల సంగమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్, జూలై 27 (ఆంధ్ర జ్యోతి): నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి వారిని రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆదివారం అమరావతి నుంచి కర్నూలుకు చేరుకున్న రాజేష్‌కుమార్ పటేల్ కుటుంబ సభ్యులకు స్థానిక ఎస్‌బీఐ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్‌శర్మ, క్లర్కు సుబ్బారెడ్డి, ఈఓ ఆది జమ్మలమ్మ వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం హేమ, కర్నూలు ఎస్‌బీఐ ఆర్ఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం

కర్నూలు కల్చరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన విశ్రాంత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి జి. రామమోహన్ ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఆధ్యాత్మిక పుస్తకాలు విరాళంగా అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, బాషాకు ఈయన వీటిని అప్పగించారు. గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ పుస్తకాలు విరాళంగా అందజేసిన విశ్రాంత ఉద్యోగి జి. రామ్మోహన్ గతంలోనూ అనేక ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేశారని గుర్తు చేశారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం కొత్తూరు, ప్యాలకుర్తి గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు అందించి పింఛన్లు, దీపం, తల్లికి వందనం పథకాలపై ఆరా తీశారు. త్వరలో అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం పథకాలను కూడా అమలు కానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్యాలకుర్తిలో ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక దళిత కాలనీలో నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రఘుపతి, చంద్రమౌళి, షేక్షావలి, సీతారాముడు, రంగన్న, విజయ్, లారీ విజయ్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ వెళ్లారు. ఆదివారం సాయంత్రం నగరంలోని అశోక్‌నగర్, హనుమాన్ ఆలయం పరిసర కాలనీల్లో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివస్ భట్, కార్యదర్శి ఎల్విప్రసాద్, ఏ మాదన్న, నాగముని, సురేష్, కాంత్, గోవింద్, వార్డు ఇంచార్జులు మాణిక్యమ్మ, కోరకంచే రవి, బూత్ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 31వ వార్డు శరీన్‌నగర్‌లోని భద్రాద్రినగర్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జి శైలజాయాదవ్, కల్లూరు మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, రేణుకమ్మ, పుల్లయ్య, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, గంగాధర్‌గౌడ్, క్యాతూరు మధు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలో ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, ఎల్లయ్యా, నాయకులు డా.మన్సూర్ బాషా, నాగప్ప యాదవ్, కురువ హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వీర కుమార్, చాంద్‌బాషా, అక్కులదేవి గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.


31వ వార్డులో 'తొలి అడుగు'లో పాల్గొన్న గౌరు జనార్దన్‌రెడ్డి


గూడూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలు అందజేస్తున్న రామాంజనేయులు

మత్తుకు బానిస కావొద్దు

తుగ్గలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిస కావద్దని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు బాలనరసింహులు, మల్లికార్జున సూచించారు. ఆదివారం మాట్లాడుతూ విద్యార్థులు, యువత అల్లరిగా తిరగకుండా చదువుకోవాలన్నారు. డ్రగ్స్‌కు బానిసగా మారితే భవిష్యత్‌ను కోల్పోయి.. తల్లిదండ్రుల ఆశయాలను అడియాశలు చేసిన వారవుతారన్నారు.

పాఠశాల భవనాలను పూర్తి చేయాలి


ఆగిపోయిన భవనాలను చూపుతున్న నాయకులు

దేవనకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ డిమాండ్ చేశారు. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. తరగతి గదులు సరిపోక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధు, బాస్కర్, మనోజ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సబ్‌స్టేషన్ పనులు


పనులను పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ మహమ్మద్ రఫి

మద్దికెర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో సబ్ స్టేషన్ పనులు వేగంగా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ అన్నారు. ఆదివారం మద్దికెర నుంచి పెరవలి గ్రామం వరకు విద్యుత్ స్థంభాల పనులను పరిశీలించారు. సబ్ స్టేషన్ ఏర్పాటుతో మద్దికెర, తుగ్గలి మండలాల్లోని 11 గ్రామాలకు సమస్య ఉండదన్నారు. సిబ్బంది వెంకటరమణ ఉన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి 'మహిళలకు ఉచితబస్సు ప్రయాణం' అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం ఆదివారం పట్టణంలోని ముస్లిం వీధిలో పర్యటించారు. 'తల్లికి వందనం' డబ్బులు అందాయా? అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ప్రమోద్ కుమార్‌రెడ్డి, చల్లారవి, బిటిగోవిందు, షాదిఖానా చైర్మన్ గుండు ఫక్రుద్దీన్, ఖాసింవలి ఉన్నారు.

ముళ్ల కంప, మురుగు తొలగింపు


మురుగు, కంపను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి పెద్ద వంకలో ముళ్ల కంప, మురుగును జడ్పీహెచ్ఎస్ విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్, టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్ సొంత నిధులతో తొలగించారు. సమీపంలోనే ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, పోలీస్ స్టేషన్, నివాసాలు ఉన్నాయి. నిత్యం దుర్గంధం వస్తుంటంతో ప్రజలు అవస్థలు పడేవారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శ్యాంబాబు సూచనతో దాతలు ఆదివారం ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేయించారు. బాలన్న, బలరాముడు, సీతారాముడు స్థానికులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో సంక్షేమం

వెల్దుర్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి చెందుతోందని టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం కలగొట్ల, కృష్ణాపురం, పుల్లగు మ్మి గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, సుబ్బారెడ్డి, జయరాముడు, రామాంజనేయులు ఉన్నారు.

వేదవతిపై వంతెన నిర్మాణానికి కృషి

హాలహర్వి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గూళ్యం సమీపంలో వేదవతిపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. ఆదివారం ఆయన గూళ్యం గ్రామంలో నాయకులతో కలిసి మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. ఇక్కడి ప్రజలకు వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోయి, పుట్టిలో ప్రయాణించి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని తనదృష్టికి వచ్చిందన్నారు. కర్నూలు-బళ్లారికి అదనపు అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైసీపీ నాయకులు రామిరెడ్డి, శ్రీనివాసులు, వీరేషప్ప, దిబ్బలింగ, ఎల్లప్ప ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆస్పరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణి అయిన భార్యను చూసేందుకు వెళ్తూ మండలంలోని అట్టేకల్ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ మస్తాన్‌వలి తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన శ్రీనివాసులు(27) భార్య పూజిత నిండు గర్భిణి. డెలివరీ కోసం పుట్టినిల్లు అయిన నగరూరు గ్రామానికి వచ్చింది. భార్య, కూతురిని చూసేందుకు శ్రీనివాసులు ఆదివారం తెల్లవారుజామున బయలు దేరాడు. అట్టేకల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కోడుమూరులో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు..


బొందిమడుగుల గ్రామంలో సీసీ రోడ్డు దుస్థితి

తుగ్గలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందిమడుగుల గ్రామంలో 12 రోజుల క్రితం ఫైబర్ నెట్ కేబుల్ వేసేందుకు సీసీ రోడ్డును తవ్వి కాంక్రీట్ వేయకుండా వదిలేశారు. సందరు కంపెనీ వారు ఇలా వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, పాదచారులు కూడా ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు కంపెనీ వారికి నోటీసు ఇచ్చి రోడ్లను కాంక్రీట్‌తో పూడ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షమా.. నీ జాడ ఎక్కడ?

- ఖరీఫ్ ప్రారంభంలో కురిసి, అనంతరం కురవని వర్షం
- ఎండిపోతున్న పంటలు


పుల్లలాపురం గ్రామంలో ఎండుతున్న పత్తి పైరు

దేవనకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలు అనంతరం మొహం చాటేయడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఇలా అయితే పంటలు ఎండిపోయి పెట్టుబడి మట్టిపాలు అవుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభంలో సమృద్ధిగా..

మండలంలో దాదాపు 60వేల ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగుచేశారు. పత్తి, వేరుశనగ, ఆముదం అధికంగా సాగమాంమమి, ఇరవై రోజులుగా వర్షం లేకపోవడంతో పంటలు బెట్టకు లోనవుతున్నాయి. వారం నుంచి ఆకాశంలో మబ్బులు కనపిస్తున్నా వర్షం మాత్రం కురియడం లేదు.

ఈ గ్రామాల్లో కాలువలు లేవు..

కోటకొండ, తెర్నేకల్లు, చెల్లెలచెలిమిల, బంటుపల్లి, పుల్లలాపురం, బండపల్లి, ఈదులదేవరబండ, మాచాపురం, గుండ్లకొండ, వెంకటాపురం గ్రామాల్లో హంద్రీ నీవా కాలువలు లేవు. దీంతో వర్షం వర్షం కురిస్తేనే పంటలు పండుతాయి.

వారంలోపు వర్షం కురిస్తేనే..



నాలుగెకరాల్లో పత్తి సాగుచేశాను. ఎకరాకు సుమారు రూ.30 వేలు ఖర్చుచేశా. ఇరవై రోజులుగా వర్షం కురవలేదు. మరో వారంలో కురియకపోతే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. - వెంకటేష్, పుల్లాపురం

19:19:19 పిచికారీ చేయాలి



పంటలు వాడుముఖం పట్టే అవకాశం ఉంది. 19:19:19 ఫెర్టిలైజర్‌ను లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పదిరోజులపాటు పంటను కాపాడుకోవచ్చు. - ఉషారాణి, ఏవో, దేవనకొండ.

హామీలు నెరవేరుస్తున్న సీఎం

హాలహర్వి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి కృష్ణం నాయుడు, కామినహాల్ రమేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కామినహాల్ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్


రేషన్ ఇస్తున్న ఇన్‌చార్జి

ఆదోని టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధుల ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేస్తున్నట్లు 19వ వార్డు ఇన్‌చార్జి శీనివాస ఆచారి అన్నారు. ఈమేరకు ఆదివారం వృద్ధులకు రేషన్ ఇచ్చారు. వార్డు పరిధిలో 55 మంది వృద్ధులు ఉన్నారన్నారు. రేషన్‌తో పాటు పింఛన్, ఇతర పథకాలను చేరుస్తామన్నారు. జనసేన నాయకులు శివ, ధర్మా, రవి పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్రాభివృద్ధి


తెర్నేకల్లులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి అన్నారు. ఆదివారం సాయంత్రం తెర్నేకల్లు గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. గత ఐదేళ్ల జగన్ పాలన గ్రామాల అభివృద్ధిని విస్మరించిందన్నారు. కన్వీనర్ విజయబాస్కర్, రామచంద్ర నాయుడు, బీ వెంకప్ప, తదితరులు పాల్గొన్నారు.

జీతాల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్ , జూలై 27 (ఆంధ్రజ్యోతి): బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలను పరిష్కరించాలని యుటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు సునీల్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జగన్మోమన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ పాఠశాల అవరణలో ఫయాజుద్దీన్ ఉపాధ్యాయులను సన్మానించారు. మోడల్ ప్రైమరీ హెచ్ఎం, స్కూల్ ఆసిస్టెంట్లకు పొజిషన్ ఐడీ లేక జూన్ నెల జీతం రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ ఫలితాలను ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఫయాజుద్దీన్, నూర్ భాషా, గిరిబాబు, రెహమాన్, అయుబ్, నజీర్ అహ్మద్ ఉన్నారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

ఆదోని రూరల్, జూలై 27 ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో నిర్మిస్తున్న బైపాస్ నాసిరకంగా ఉందని సీపీఎం నాయకులు రాధాకృష్ణ, గౌస్ దేశాయ్ ఆరోపించారు. ఆదివారం రహదారిని పరిశీలించారు. రూ.150కోట్లతో చేస్తున్న పనులు నాసిరకంగా ఉన్నాయని అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. ఈవిషయమై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉరుకుందకు పాదయాత్ర


పాదయాత్ర ప్రారంభించిన భక్తులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యువజన మిత్రమండలి సభ్యులు సోమవారం ఉరుకుందకు పాదయాత్ర ప్రారంభించారు. కిలిచిన్‌పేట నుంచి శ్రావణ మాసం మొదటి సోమవారం 500 మంది కలిసి వెళుతున్నట్లు తెలిపారు. లక్ష్మణ, వేకబోటి గోపాల్, శ్రీనివాస్, రమేష్, యువరాజ్ ఉన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మద్దికెర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కళాకా రుల కన్వీనర్ రామ్మోహన్, కుల్లూరు శంకర్‌బాబు అన్నారు. ఆదివారం మద్దికెరలో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన వికసిత్ భారత్ అమృత్ కర పత్రాలను పంపిణీ చేశారు. చంద్ర శేఖర్ యాదవ్, శ్రీనివాసులు ఉన్నారు.

కౌలు కార్డులు ఇవ్వాలి

మద్దికెర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని సీపీఐ నాయకులు నాగరాజు, సుధా కర్, రైతు సంఘం అధ్యక్షుడు మదనం తపరం హనుమన్న, కోదండరాముడు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడు తూ మండలంలో 2వేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారన్నారు. కార్డులు ఇస్తేనే బీమా, బ్యాంకు రుణాలు, రాయితీ విత్తనాలు అందుతాయన్నారు.

రూ.76.12లక్షల లాభాలు

- టౌన్ బ్యాంకు చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి



ఆదోని టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమ బ్యాంకు ఈ ఏడాది రూ.76.12 లక్షల నికర లాభాలు సాధించినట్లు ప్రియదర్శిని అర్బన్ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ బీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బ్యాంకు 28వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మెరుగైన సేవలను అందిస్తున్నామని రూ.56.20 కోట్ల డిపాజిట్లు, రూ.33.17 కోట్ల మేర రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది మూలధనంపై 9 శాతం డివిడెండ్ ఇచ్చేందుకు నిర్ణయించామని ఖాతాదారులకు బ్యాంకుపై నమ్మకం పెరిగిం దన్నారు. వైస్ చైర్మన్ ఎం.లక్ష్మణ రావు, డైరెక్టర్లు కే దీప్, జీపీ దర్శన్ లాల్, దశదథరామి రెడ్డి, సీఈవో రమేష్ పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

తుగ్గలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పీ-4లో భాగస్వాములు కావాలని ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ సూచించారు. ఆదివారం మాట్లాడుతూ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఓ కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు.

'అన్నదాత సుఖీభవను వర్తింపజేయాలి'

పత్తికొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'ను వర్తింపజేయా లని ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండలో మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. గుర్తింపు కార్డుతో పాట పథకాలన్నీ అమలు చేయాలని 28వ తేదీన సచివాలయాల అధికారులకు వినతి పత్రం ఇస్తామన్నారు.

దారిమధ్యలో గుంత


పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంత

పత్తికొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆదోని రహదారిలోని గోపాల్ ప్లాజా వద్ద రహదారి మధ్యలో పెద్ద గుంత పడింది, దీంతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్లు వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ జేఈ సునీల్‌ను వివరణ కోరగా గుంతను పూడ్చివేస్తామన్నారు.

విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న భాస్కర్‌రెడ్డి

ఆదోని, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబ వికాసం దిశగా నడిపిస్తున్నారని టీడీపీ నాయకుడు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప, బుద్ధారెడ్డి, గోపాల్‌రెడ్డి, షేక్షావలి పాల్గొన్నారు.

బీసీ రుణాలు ఇవ్వాలి


మంత్రి సవితను కలిసిన టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రుణాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు గడ్డం రామాంజులు, జమేదార్ జంబునాథ్‌రాయుడు కోరారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిశారు. బీసీల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారనీ అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం


దేవనకొండలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై ఆ సంఘం సభ్యుడు మలకన్న హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిధులు మంజూరు చేయడంతో దూదేకుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. నూర్ అహ్మద్, టీచర్ నబిరసూల్, బట్టల సత్తార్, రాజాసాబ్, చాంద్, రంజాన్, యాహియా, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: సీఎం చంద్రబాబు దూదేకులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఆ సంఘం నాయకులు, చిప్పగిరి మండల టీడీపీ కన్వీనర్ షేక్షావలి, మాలిక్, ఆలూరు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ శాలిసాహెబ్ అన్నారు. ఆదివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దర్గావలి, మాబాషా, హుసేన్‌పీరా, హత్తి బెళగల్ షేక్షావలి, మహమ్మద్ రఫి, ఖాసిం, రాజాసాబ్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత కలిశారు

- 2005-06 విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 27 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. తమ పాఠశాలను చూసి నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఉదయం పాఠశాలకు చేరుకొని నాడు చదువులు నేర్చుకున్న తరగతికి వెళ్లి అప్పుడు చేసిన అల్లర్లను వారంతా జ్ఞాపకం వేసుకున్నారు. హెచ్ఎం ఫయాజుద్దీన్ నాటి గురువులు జయమ్మ, రామకృష్ణ, శర్మ, బాబు సాహెబ్ జాన్ విక్టర్లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీమన్నారాయణ, విజయ లక్ష్మి, జయరాం, అంజి, చింతలముని, శాంత కుమారి, తాయన్న, ఉరుకుంద, విశ్వనాథ్, జ్యోతి, ఉష, అయ్యప్ప పాల్గొన్నారు.

బీసీలు ఐక్యతను చాటుకోవాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

ఆదోని టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీసీలంతా తమ ఐక్యతను చాటాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం బీమాస్ ఫంక్షన్ హాల్‌లో నాయకులు నీలకంఠ, ఎండీ బసవరాజ్, విరుపాక్షి స్వామి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. చట్ట సభల్లో రిజర్వేషన్‌ను అమలు చేయకపోవడాన్ని విమర్శించారు. ఆగస్టులో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టే నిరసన లో పాల్గొనాలని కోరారు. సాకరే మల్లేశ్వర స్వామి రావు, రసాలే గోవింద రావు హుసేనప్ప యాదవ్, మురళీధర్ గౌడ్, రామునాయక్, నరేంద్ర పాల్గొన్నారు.

అనుమతి లేని మైనింగ్‌పై చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆస్పరి తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి



ఆస్పరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతి లేని మైనింగ్‌పై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్రశ్న: కార్డుదారుల ఇబ్బందులను పరిష్కరిస్తున్నారా?

జవాబు: మజరా గ్రామాల్లో రేషన్ డీలర్లు లేరు. దీంతో డీలర్లే గ్రామాలకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించాం.

ప్రశ్న: వృద్ధులు రేషన్ కోసం క్యూలో నిలుచోలేరు. వారికి ఏర్పాట్లు చేశారా?

జవాబు: వృద్ధులకు నాలుగు రోజుల ముందుగానే ప్రతినెలా 26వ తేదీ నుంచే రేషన్ పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు?

జవాబు: వీఆర్వోలు ఖచ్చితంగా గ్రామాల్లో రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించాం.

ప్రశ్న: మండలంలో రీ సర్వే ప్రక్రియ ఎంతవరకు వచ్చింది?

జవాబు: మండలంలో 33 గ్రామాలు ఉండగా పది గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశాం. ఇంకా 23 గ్రామాల్లో పూర్తి కావలసి ఉంది.

ప్రశ్న: ప్రభుత్వ భూములను గుర్తించారా?

జవాబు: నవంబర్ లోపు ప్రభుత్వ భూములను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

ప్రశ్న: మైనింగ్ అనుమతులు ఇచ్చారా?

జవాబు: గతంలో కొన్ని గ్రామాల్లో గ్రానైట్ మైనింగ్‌కు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం ఇవ్వలేదు.

ప్రశ్న: దొడగొండ కొండల్లో మైనింగ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వారిపై చర్యలు తీసుకున్నారా?

జవాబు: అనుమతి లేకుండాయి మైనింగ్ చేసేవారికి చర్యలు తీసుకుంటాం. ఇవేడే వీఆర్వో, వీఆర్ఏల ద్వారా సమాచారం తెలుసుకుని, అరికడతాం.

రహదారులు అధ్వానం

- ఎమ్మిగనూరు - మాలపల్లి రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారుల్లో భయం
- అడుగడుగునా.. గుంతలే
- ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు.. పట్టించుకోని అప్పటి వైసీపీ ప్రభుత్వం



ఎమ్మిగనూరు పట్టణ శివారులో మాలపల్లి రోడ్డు దుస్థితి



కొత్తగొల్లదొడ్డి, జగ్గాపురం అడ్డరోడ్డు మధ్యలో తారు రోడ్డు దుస్థితి



జగ్గాపురం అడ్డరోడ్డు సమీపంలో రహదారి దుస్థితి

ఎమ్మిగనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు - మాలపల్లి రోడ్డు అంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. వామ్మో.. ఆరోడ్డుపై ప్రయాణమంటే నరకమే.. అని భీతిల్లుతున్నారంటే ఆరోడ్డు ఏమేరకు పాడైపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఎమ్మిగనూరు పట్టణం మొదలుకుని పెద్దకడుబూరు మండలం కంబళదిన్నె గ్రామం వరకు అడుగుకో గుంత అనటంలో అతిశయోక్తి లేదు. దీన్ని బట్టి చూస్తే రోడ్డు ఎంత అధ్వా నంగా మారిందో తెలిసిపోతుంది. తప్పని పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణాలు చేస్తున్నారు. అంతో ఇంతో ఈ రోడ్డు గురించి తెలిసిన వాహనదారులు కోసిగి, ఉరుకుంద, కౌతాళంకు వెళ్లాలంటే మంత్రాలయం మీదుగా ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం..

ఐదేళ్ల క్రితం 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మిగనూరు, మాలపల్లి రోడ్డును ఎన్‌డీబీ (న్యూడెవలప్ మెంట్ బ్యాంకు) నిధులు రూ. 24.15 కోట్లతో సింగిల్ రోడ్డుతో పాటు అప్పటి ఉమ్మడి జిల్లాలోని 13 రోడ్లు కలిపి ఒక ప్యాకేజీ కింద నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఎస్‌ఎస్‌పీఆర్ అనే కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేసేందుకు టెండర్ దక్కించుకుంది. అయితే ఇందులో డోన్ నియోజకవర్గంలోని రామళ్లకోట రోడ్డు పూర్తికాగా, కోడుమూరు, లద్దగిరి రోడ్డు పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. మిగతా రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్మాణాలపై దృష్టి సారించకపోవటంతో ఎమ్మిగనూరు-మాలపల్లి రోడ్డుతో పాటు మిగతా రోడ్లు మరింత అధ్వాన్నంగా మారాయి. ఐదేళ్ల కాలంలో కనీసం మరమ్మతులకు నోచుకోకపోవటంతో మాలపల్లి రోడ్డు, ఎమ్మిగనూరు పట్టణం నుంచి కంబళదిన్నె వరకు అడుగుకో గుంత.. అన్న చందంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది.

కూటమి ప్రభుత్వం రాకతో కదలిక: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రహదారుల నిర్మాణాల్లో కదలిక వచ్చింది. పనులు ప్రారంభం కాని రహదారి టెండర్లను రద్దు చేయటంతో 2020లో ఎమ్మిగనూరు-మాలపల్లిరోడ్డు, మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడుబూరు- బైచిగేరి రోడ్డు నిర్మాణపనులు కూడా రద్దయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వెంటనే ఎమ్మిగనూరు-మాలపల్లి 12 కి.మీలు కంబళదిన్నె గ్రామం వరకు, పెద్దకడుబూరు నుంచి బైచిగేరి అడ్డరోడ్డు వరకు కొత్తగా రోడ్డు (సింగిల్ రోడ్డు) వేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఈ ఏడాది మార్చి నెలలో మాలపల్లి రోడ్డుకు రూ. 6కోట్లతోను, పెద్దకడుబూరు- బైచిగేరి అడ్డరోడ్డువరకు 13.75 కిమీలు రూ. 7.50కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఈ రహదారులపై నిత్యం వందల సంఖ్యంలో వాహనాలు రాకపోకలు జరుగుతుండటంతో సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు వేసేందుకు కొత్తగా ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు మరోసారి స్థానిక అధికారులను ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆదేశించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో హామ్ స్కీం కింద ఎమ్మిగనూరు-మాలపల్లి రోడ్డు (ఎమ్మిగనూరు - కంబళదిన్నేగ్రామం వరకు) 12 కిమీ కొత్త రోడ్డు వేసేందుకు రూ. 35.67 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అలాగే మండల కేంద్రమైన పెద్దకడుబూరు నుంచి ఆదోని రహదారిలోని బైచిగేరి అడ్డరోడ్డు వరకు 13.75 కిమీ డబుల్‌రోడ్డు వేసేందుకు రూ. 36.13కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఉరుకుంద ఉత్సవాలు ప్రారంభం: కౌతాళం మండలం ఉరుకుందలో వెలసిన ఉరుకుంద ఈరన్న స్వామి ఉత్సావాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నెల రోజుల పాటు సాగుతాయి. స్వామివారిని దర్శించుకునేందుకు ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, బెళగల్, పత్తికొండతో పాటు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు వస్తారు. ప్రధానంగా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు, బెళగల్, నందవరం, నాగలదిన్నెగ్రామాల తోపాటు ఆయా ప్రాంతాలనుంచి ఎమ్మిగనూరు- మలపల్లి రోడ్డుపైనే ప్రయాణం సాగించాల్సి ఉంది. రోజు వందల సంఖ్యలో ఆటోలు, జీపులు, బొలేరోలు, కార్లు, మిని బస్సులు, ట్రాక్టర్లు, మినిలారీలతో పాటు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేగాక నిత్యం ఈ రహదారిపై ఎమ్మిగనూరు నుంచి ఉరుకుంద వరకు దాదాపు 25నుంచి 30గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఈ రోడ్డు వాహనాలతో రద్దిగా కనిపిస్తుంటుంది. ఇలాంటి రోడ్డును పాలక ప్రభుత్వాలు, పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉరుకుంద ఈరన్న శ్రావణమాస ఉత్సవాలలో అయినా రోడ్డును వేస్తారని ఆశించినప్పటికీ భక్తుల ఆశలు అడియాసలయ్యాయి. కనీసం మరమ్మత్తులు చేసి గుంతలు పూడ్చాలని భక్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం



ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు రెండు రోడ్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

విజయ్ నరేష్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ, ఎమ్మిగనూరు

పది నిమిషాల ప్రయాణానికి అరగంట..



పొలం నుంచి మాఊరుకు పది నిమిషాల్లో వెళ్లోచ్చు. అలాంటిది ఈ గుంతలరోడ్డులో అరగంట పడుతుంది. అంతేగాక ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలబారిన పడాల్సి వస్తుంది. ఎన్నిరోజులు ఇలా ఇబ్బందులు పడాలో అర్థం కావటం లేదు. ప్రభుత్వం వెంటనే రోడ్డు కాకపోయిన గుంతలైన పూడ్చి మరమ్మత్తులు చేయాలి.

అంజినయ్య, జగ్గాపురం

కొత్తరోడ్డు వేయాలి



ఎప్పుడో వేసిన రోడ్డు ఇది. పూర్తిగా పాడై పోయింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే కష్టంగా ఉంది. మోటారు బైక్ నడపడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం కొత్తగా రోడ్డు వేస్తుందని ఎదురు చూస్తున్నాం.

- బాలరాజు, కంపాడ

పెద్దకడుబూరు- బైచిగేరి రోడ్డు వెంటనే వేయాలి



పెద్దకడుబూరు, బైచిగేరి అడ్డ రోడ్డువరకు రహదారి అధ్వాన్నంగా మారింది. తారురోడ్డు పూర్తిగా పాడైపోయి కంకరతేలింది. వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడతున్నారు. అంతేగాక వర్షాకాలంలో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త రోడ్డునిర్మాణ పనులు చేపట్టాలి.

వీరేష్ నాయుడు, సీపీఐ మండల కార్యదర్శి, పెద్దకడుబూరు

ఆలయానికి విరాళం

కౌతాళం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కర్ణాటకకు చెందిన భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి విజయరాజు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కర్ణాటక బళ్ళారి పట్టణానికి చెందిన కృష్ణ చైతన్య అనే భక్తుడు రూ.1,38,123ల నగదును దేవస్థానంలో విరాళంగా అందజేసినట్లు తెలిపారు. దాతకు ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సన్మానించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ రాజు, అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ వీరేష్‌లు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నీటి ప్రవాహాన్నిపరిశీలిస్తున్న ఆర్ఐ

నందవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీతీర గ్రామాలైన నదికైరవాడి, గంగవరం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, జోహరాపురం, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం నదీతీర గ్రామమైన గురుజాల దగ్గర నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో దండోరా వేయించామ న్నారు. రైతులు నదీతీర ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. రైతులు పంట పోలాల దగ్గర మోటర్లను వదలడానికి వెళ్ళోద్దని తెలిపారు. ఈతకు, స్నానానికి వెళ్లొద్దని మైకుల ద్వారా హెచ్చరించామన్నారు.

హామీలు నెరవేర్చడంలో సీఎం విఫలం



నందవరంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

నందవరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని మాజీ ఎంపీ, వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక అన్నారు. అదివారం మండల కేంద్రమైన నందవరంలో 'చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' పై మండల స్థాయి సమావేశం మండల పార్టీ కన్వీనర్ శివా రెడ్డిగౌడు ఆధ్వర్యంలో జరిగింది. చంద్రబాబు ప్రతీ సారి ప్రజలను మోసం చేస్తూ అబద్ధాలు చెబుతూ సీఎం అవుతున్నారని అమె ఆరోపించింది. కార్యక్రమంలో గోనెగండ్ల మండల కన్వీనర్ వేముగోడు కృష్ణారెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



దేవిబెట్ట గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవిబెట్ట గ్రామంలో వెలసిన ఈశ్వర స్వామివారి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే వేడుక ప్రారంభం కాగా స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులుగా ఈశ్వరస్వామి కొటే కల్లు రాయచోటి స్వామి నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, అష్టదిక్పాలకుల కలశ ప్రతిష్ఠ పూజలు చేశారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటరామిరెడ్డి, సోమేశ్వరరెడ్డి, నరసింహులు, మల్లికార్జున, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



వాహనంపై అధిక సంఖ్యలో ఎక్కిన కూలీలు

పెద్దకడబూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): గ్రామంలో కొన్ని రోజులుగా కూలీలకు పనులు లేకపోవడంతో గ్రామం నుంచి నందవరం మండలంలోని పెద్దకొత్తిలి, పెద్దకడుబూరు తదితర గ్రామాలకు కూలీలు పనులకు వెళ్తున్నారు. అయితే ఒకే వాహనంలో దాదాపు 80 మందికిపైగా ఎక్కి ప్రయాణం చేస్తున్నారు. ఈ దృశ్యం చూసిన స్థానికులు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీడీపీకి చేరిన హంద్రీ-నీవా నీరు

గోనెగండ్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా మెయిన్ కాలువ (హెచ్ఎన్ఎస్) నుంచి విడుదలైన నీరు ఆదివారం గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కు చేరినట్లు ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా నుంచి జీడీపీ ప్రాజెక్టుకు 100 క్యూసెక్కుల నీరు విడుదల కాగా వేస్టేజ్ కింద 40 క్యూసెక్కులు ఆవిరి కాగా 60 క్యూసెక్కుల నీరు జీడీపీని చేరాయి. అలాగే తుంగభద్ర దిగువ కాలువ నుంచి గత వారం రోజులుగా రోజుకు 60 క్యూసెక్కుల ప్రకారం జీడీపీకి విడుదల చేశారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

మంత్రాలయం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులందరికీ యూరియా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి అన్నారు. ఆదివారం బసాపురం-52లో ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందిచాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగరాజు, ఈరన్న, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 27(ఆంధ్రజ్యోతి: శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. ఆదివారం శ్రావణ తదియ శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల బంగారు రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి హారతులు ఇచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు. భక్తులకు పీఠాధిపతి శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శ్రావణ ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహరాష్ట్ర నుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

మంత్రాలయం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వాలని పాఠశాల హెచ్ఎం లక్ష్మీకాంత్, ఆదర్శ మిత్ర మండలి సభ్యులు కేశవయ్య, డా.శ్రీవిద్య అన్నారు. శనివారం మండలంలోని విద్యానగర్, ఎఫ్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 500 ప్లేట్లు, పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను ఆదర్శ మిత్రమండలి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవాణి, అనంతప్రసాద్, రవిప్రకాష్ శ్యాం, ఉమాశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడాడు. ఈ ఘటన మండలంలోని బోడబండ గ్రామ సమీపంలోని వెటర్నరీ కళాశాల వెనుక జరిగింది. మండలంలోని గుడికల్లు గ్రామానికి చెందిన బోయ వీరారెడ్డి పెద్దకుమారుడు బోయ ప్రవీణ్(24)కు కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేదు. ఇదివరకు కూడా గ్రామంలో ఉన్న కొండపై నుంచి దూకేందుకు యత్నించాడు. ఆదివారం బోడబండ గ్రామ సమీపంలోని వెటర్నరీ కళాశాల వెనుక భాగాన ఉన్న నాగమ్మగుడి సమీపంలో వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుకు సమాచారం అందించగా ఆయన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రవీణ్‌కు ఒక కుమార్తె ఉంది. అతని భార్య తులసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగల అరెస్టు.. లాడ్జి రికార్డుల స్వాధీనం

మంత్రాలయం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ఐదు నెలలుగా గుర్తు తెలియని వ్యక్తులు లాడ్జీల్లోని రిసెప్షన్ కౌంటరులో ఉంచిన ఎంట్రీ రికార్డుల పుస్తకాలను అపహరించుకుని వెళ్తున్నారు. ఆదివారం ఇదే తరహాలో ఎంఎం లాడ్జీలో బెస్త నాగరాజు లీజుకు తీసుకున్న లాడ్జీలోని రిసెప్షన్ కౌంటర్ వద్ద ఉన్న ఎంట్రీ బుక్స్‌ను అపహరించుకుని వెళ్లారు. అప్రమత్తమైన లాడ్జీ నిర్వాహకులు ఇద్దరు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా హొలికేరీ తాలుకా కావలి గ్రామానికి చెందిన మంజునాథ, అదే కొరచర హత్తి గ్రామానికి చెందిన ప్రమోద్ అనే వ్యక్తులు బైక్‌పై వచ్చి మంత్రాలయంలోని రికార్డులను అపహరించుకు వెళ్తున్నారు. ఈ రికార్డుల్లో.. లాడ్జీల్లో బస చేసే ప్రముఖులతో పాటు సాధారణ భక్తులు వారి అడ్రస్సులు, ఫోన్ నంబర్లు తీసుకుని ఫోన్ చేసి బెదిరిస్తూ బసచేసిన లాడ్జీల పేర్లు చెప్పి వారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఐదు నెలలుగా లాడ్జీల్లో చోరీ అవుతున్న పుస్తకాలు మాయం కావడంతో ఇద్దరు దుండగులను మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ పట్టుకుని వారివద్ద ఉన్న రెండు లాడ్జీల ఎంట్రీబుక్స్‌ను స్వాధీనం చేసుకుని వారిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. రికార్డుల్లోని సమాచారం ఆధారంగా భక్తులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎస్ఐ తెలిపారు.

బీవీ మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి



ఉల్లిందకొండలో బీవీ ఘాట్ దగ్గర నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు



ఉలిందకొండలో మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు తనతండ్రి, మాజీ మంత్రి దివంగతనేత బీవీ మోహన్ రెడ్డి అని, ఆయన సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. దివంగతనేత బీవీ మోహన్ రెడ్డి 13వ వర్ధంతిని ఎమ్మిగనూరు, ఉల్లిందకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లిందకొండలోని బీవీ ఘాట్ దగ్గర, ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో బీవీ మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆయన తనయుడు, ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. తన తండ్రి ఆశయసాధనకోసం , ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య, టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, మహేంద్ర బాబు, భాస్కర్, విరుపాక్షి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సురేష్ చౌదరి, పట్టణ, మండల నాయకులు మహేష్, తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమై నందవరంలో, నాగలదిన్నెలో దివంగతి బీవీ మోహన్‌రెడ్డికి నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. నందవరం పార్టీ కార్యాలయంలో బెస్తా ఈరన్న, ఈస, మల్లి దేవర్ల నాగరాజు, గడ్డం బజారి, వీరేష్, బీమశేఖర్ నివాళి అర్పించారు.

గోనెగండ: దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి సేవలు ఎమ్మిగనూరు నియోజక వర్గ ప్రజలు ఎన్నటికి మరువలేనివని మండల టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 13వ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలట మాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేతాలబడేసా, పట్టణ అధ్యక్షుడు మహల్ రహంతుల్లా, అక్బర్, భారతం రహ్మతుల్లా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎమ్మి గనూరు టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉలిందకొండకు వెళ్లారు. అక్కడ ఆయన ఘాట్‌వద్ద ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, మండల నాయకులు మాజీ ఎంపీపీ శంకరయ్య, జగదీష్, రాఘవేంద్ర, కడిమెట్ల చంద్ర పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సత్కారం



వీఆర్ పంచముఖి దంపతులతో పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురు సార్వభౌమ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి వీఆర్ పంచముఖి 2025 మే 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ తరుపున ఎన్నికైన వీఆర్ పంచముఖి దంపతులకు ఆదివారం రాత్రి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను కలిశారు. అవార్డును తిలకించి స్వామీజీ వారిని సత్కరించారు. ఈ పద్మశ్రీ అవార్డు మంత్రాలయానికి దక్కడం అభినందించదగ్గ విషయమని, ఇలాంటి అవార్డులు రాఘవేంద్రస్వామి మఠానికి చెందడం పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. ఇందుకు శ్రీమఠం అధికారులు అభినందనలు తెలియజేసి శాలువలు, పూలమాలలతో సత్కరించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

ఎమ్మిగనూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కూటమి ప్రభుత్వ విఫలమైందని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భీమేష్, స్థానిక నాయకులు జావీద్ మీయాదాదా, ప్రవీణ్‌లు అన్నారు. ఆగస్టు 7న తలపెట్టిన 'చలో విజయవాడ'కు కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జావేద్, పోతప్ప, యూనుస్‌లు పాల్గొన్నారు.

'అధైర్య పడవద్దు.. అండగా ఉంటా'

కోసిగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ భీమయ్యగౌడును ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరామర్శించారు. అలాగే డి.బెళగల్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లతీఫ్ హుశేనీ తల్లి కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో కార్యకర్త లతీఫ్ హుశేనీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎవరూ అధైర్యపడవద్దని, అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేని దృశ్యం

గోనెగండ్ల, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేక పోవడం, ఎత్తుకట్టపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకుండా భూమికి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచెలేక పోవడంతో పాటు తక్కువ ఎత్తులో ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పచ్చిగడ్డి మొలకెత్తడంతో మూగజీవాలు గడ్డిని మేసేందుకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే తక్కువ ఎత్తులో ఉండటం కారణంగా చుట్టు పక్కల నివాసం ఉంటున్న పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన చాల సందర్భాలలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడ్డాయని ఆ ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు స్పందించి ఎత్తుకట్టపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.